రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, నవంబర్ 7 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధరతోపాటు బోనస్ పొందాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి సమీపంలోని వైష్ణవి రైస్‌మిల్లును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 82 సన్న రకం, 258 దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 7.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉందన్నారు. ఇప్పటి వరకు సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, అందుకుగాను రూ.7 కోట్లను రైతులకు చెల్లించినట్లు చెప్పారు. అనంతరం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో సమగ్ర కుటుంబ సర్వేను కలెక్టర్ పరిశీలించారు.ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, సివిల్‌సప్లై అధికారి వెంకటేశ్వర్లు, తాసీల్దార్ హరిబాబు, సివిల్ సప్లయ్ డీటీ జావిద్, మిలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్, వైష్ణవి మిల్ చైర్మన్ కర్నాటి లక్ష్మీనారాయణ, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణచౌదరి, ఆర్‌ఐ సత్యనారాయణ ఉన్నారు.

వాడపల్లిని సందర్శించిన కలెక్టర్

దామరచర్ల : మండలంలోని వాడపల్లి వద్ద కృష్ణామూసీ నదుల సంగమ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. మీనాక్షీ అగస్తేశ్వరస్వామి, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసంలో భక్తులు స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్డు వేయాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు. ఆమె వెంట సబ్ కలెక్టర్, తాసీల్దార్ జవహర్‌లాల్, ఆలయ కమిటీ చైర్మన్ కె. సిద్దయ్య ఉన్నారు.

స్కౌట్స్ విద్యార్థులతో కలెక్టర్

నల్లగొండ : భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ డే సందర్భంగా పర్యావరణ వేత్త సురేశ్ గుప్తా కేంద్రీయ, సెయింట్ ఆల్ఫన్సెస్ విద్యార్థులు గురువారం జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రెసిడెంట్, కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ వేత్త సురేశ్ గుప్తా, రిటైర్డ్ స్కౌట్ మాస్టర్ రాములు, కార్యదర్శి కరునాకర్, స్వామి, రాజు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలు భాగస్వాములవ్వాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్

మునుగోడు : వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

మునుగోడు, నవంబర్ 7 : సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలు భాగస్వాములై తమ ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు వివరాలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ జె. శ్రీనువాస్ కోరారు. మండలంలోని కొంపెల్లి గ్రామంలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న ఇంటింటి స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం కొంపెల్లి గ్రామంలోని ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా కొనుగోళ్లు జరుపాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీపీఓ మురళి, చండూరు ఆర్డీఓ శ్రీదేవి, ఎంపీడీఓ విజయభాస్కర్, తాసీల్దార్ నరేందర్, ఏపీఓ స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శి స్వామి ఉన్నారు.

ప్రతి ఇంటిని సర్వే చేయాలి : ఆర్డీఓ

నల్లగొండ రూరల్, నవంబర్ 7: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలని ఆర్డీఓ అశోక్‌రెడ్డి సూచించారు. మండలంలోని అన్నెపర్తి గ్రామంలో గురువారం సర్వేను పరిశీలించారు. ఎన్యూమరేటర్లతో మాట్లాడి వివరాలు సేకరించారు. రేపటి వరకు స్టిక్కరింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట నల్లగొండ తాసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

తప్పులు లేకుండా ఫారాలు నింపాలి

కొండమల్లేపల్లి : సమగ్ర కుటుంబ సర్వే ఫారాల్లో తప్పులు లేకుండా చూడాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి సూచించారు. గురువారం పాత కొండమల్లేపల్లి, చిన్నఅడిశర్లపల్లి గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ ఎండీ అన్వర్ హుస్సేన్, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

కట్టంగూర్ : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని కల్మెర గ్రామంలో సర్వేలో భాగంగా ఇండ్ల గుర్తింపు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. సర్వే పత్రాలను తప్పులు లేకుండా నింపాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ ఇంట్లో కుటుంబ సర్వే సిబ్బంది

కలెక్టర్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్

నీలగిరి : సమగ్ర కుటుంబ సర్వే సిబ్బంది గురువారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఎన్యూమరేటర్ ఆయేషా హమీరా జిల్లా కలెక్టర్ బంగ్లాకు వెళ్లి ఇంటి నంబర్, యజమాని వంటి వివరాలు అడిగి తెలుసుకుని ఆమె ఇంటికి స్టిక్కర్ అంటించారు. ఎన్యూమరేటర్‌కు వివరాలు అందించిన కలెక్టర్ పూర్తి వివరాలు ఎప్పుడు సేకరిస్తారు అని ప్రశ్నించారు. ఈ నెల 9 నుంచి మరోసారి ఇండ్లను సందర్శించి పూర్తి వివరాలు సేకరిస్తామని ఎన్యూమరేటర్ సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్యూమరేటర్‌లకు వివరాలు అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, సూపర్‌వైజర్ రోహిత్ పాల్గొన్నారు.

గర్భిణులకు కుళ్లిన కోడి గుడ్లు పంపిణీ

● శెట్టిపాలెం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఘటన

గర్భిణికి ఇచ్చిన కుళ్లిపోయిన కోడిగుడ్డు

వేములపల్లి, నవంబర్ 7: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంగా ప్రభుత్వం బాలామృతంతో పాటు కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నది. ఏజెన్సీల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయి. గురువారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పంపిణీ చేసిన గుడ్లలో కొన్ని కుళ్లిపోయినవి ఉండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గర్భిణులకు అందించిన గుడ్లను ఇంటికి తీసుకెళ్లి పగులగొట్టి చూడగా కుళ్లిపోయి భరించలేని దుర్వాసనతో ఉన్నట్లు పలువురు లబ్ధిదారులు తెలిపారు. వాటిని నేరుగా ఉడకబెట్టి తింటే గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం ఏమవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత సూపర్‌వైజర్ వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే బాలూనాయక్

పెండ్లిపాకల రిజర్వాయర్‌లో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

కొండమల్లేపల్లి/చందంపేట, నవంబర్ 7 : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. గురువారం కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాల రిజర్వాయర్‌లో, నేరేడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీ గ్రామ సమీపంలోని సాగర్ వెనుక జలాల్లో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండ్లిపాకల రిజర్వాయర్ ఎత్తును పెంచే పనులకు త్వరలో రూ.6 వందల కోట్లతో టెండర్లు పిలువనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి చరిత, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణూధర్‌రెడ్డి, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, మత్స్య సహకార సంఘం చైర్మన్ శక్రునాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ జమునా మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణూధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నార్కోటిక్ స్నీపర్‌డాగ్‌తో పోలీసుల తనిఖీలు

నార్కోటిక్ స్నీపర్‌డాగ్‌తో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

నీలగిరి, నవంబర్7 : నల్లగొండ పట్టణంలోని పలు కాలనీలు, ముఖ్య కూడళ్లల్లో నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ సీఐ డానియల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. పలు కాలనీలతో పాటు ముఖ్య కూడళ్లు, హోటళ్లు, లాడ్జిల్లో యాంటీ నార్కోటిక్ స్నీపర్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 29మందిపై పెట్టి కేసులు, మద్యం సేవించి వాహనాలు నడుతున్న 16 మందిపై కేసు నమోదు చేశారు. సరైన పత్రాలు లేకుండా ఉన్న 14 వాహనాలను సీజ్ చేసి వాహనదారులను ఆదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తుంటే చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరైన కాలనీల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు తెలుపాలని సూచించారు. అనంతరం మద్యం సేవిస్తూ పట్టిబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రావుల నాగరాజు, సురేశ్, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంకాం విద్యార్థులకు ఆర్థిక భరోసా అభినందనీయం

ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

ఎంకాం విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న వీసీ

రామగిరి, నవంబర్ 7: మహాత్మా గాంధీ యూనివర్సిటీకి చెందిన ఎంకాం విద్యార్థులను విద్యలో ప్రోత్సహించేలా నగదు ప్రోత్సాహకం అందించడం హర్షణీయమని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. నల్లగొండ చెందిన విశ్రాంత సహాయ షెడ్యూల్ తెగల సంక్షేమశాఖాధికారి కడారు లక్ష్మారెడ్డి గురువారం ఎంజీయూకు ఐదు సిమెంట్ బెంచీలను, ఎంకాం మూడవ సెమిస్టర్‌లో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు రూ.3వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందించారు. వీటిని వీసీ విద్యార్థులకు అందించారు. అనంతరం వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ హరీశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంజీయూ ఎంకాం విభాగం అధిపతి ఆకుల రవి, ఓఎస్డీ కొప్పుల అంజిరెడ్డి, అధ్యాపకులు శ్రీదేవి, ప్రిన్సిపాల్ మారం వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఈ నెల 3వ వారంలో జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన : డీఈఓ

రామగిరి, నవంబర్ 7: జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన ఈ నెల 3వ వారంలో నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 అంశాలల్లో ప్రదర్శన ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయించి ప్రదర్శించాలని సూచించారు. 'సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర' అంశంతో జరిగే ప్రదర్శనలో ఏడు ఉప అంశాలు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని సంప్రదించాలని సూచించారు.

9న ఎంజీయూలో పలు నిర్మాణ పనులకు శంకుస్థాపన

రామగిరి : ఎంజీ యూనివర్సిటీలో పరిపాలనా భవనం, మహిళా హాస్టల్ అదనపు భవనాల నిర్మాణ పనులకు, సీసీ రోడ్డు పనులకు ఈ నెల 9న ఉదయం 11గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి ఒక ప్రకటనలో తెలిపారు. లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

నవ వధువు కిడ్నాప్

నీలగిరి, నవంబర్ 7 : నవ వధువును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన గురువారం నల్లగొండ పట్టణంలో చోటు చేసుకుంది. నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన రాజేశ్వరి, నిడమనూరుకు చెందిన హరిప్రసాద్ ప్రేమించుకొని గత నెల 23న నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో బైరి నరేశ్ సమక్షంలో ఆదర్శ వివాహం చేసుకున్నారు. రాజేశ్వరి తన డిగ్రీ సర్టిఫికెట్లు తీసుకునేందుకు గురువారం పట్టణంలోని కాకతీయ డిగ్రీ కళాశాలకు భర్తతో కలిసి వచ్చింది. అక్కడ వేచి ఉన్న కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు హరిప్రసాద్ కండ్లల్లో కారం చల్లి అమ్మాయిని కిడ్నాప్ చేశారు. కొద్ది సేపటికే తేరుకున్న హరిప్రసాద్ నల్లగొండ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కళాశాలలోని సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం వైద్యం అందేలా చూడాలి

● డీఎంహెచ్ఓ శ్రీనివాస్

మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

నీలగిరి, నవంబర్ 7 : జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను మరింత చెరువ చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో జిల్లాలోని ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా ఉండరాదని సూచించారు. గర్భిణులకు వైద్యం అందేలా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, పీఓడీటీటీ డాక్టర్ కృష్ణకుమారి, డీటీసీఓ కళ్యాణచక్రవర్తి, డీఐఓ పద్మ, ప్రోగ్రాం ఆఫీసర్లు అరుంధతి, రాజేశ్ డీఎంఓ దుర్గయ్య, శాంతకుమారి, వెంకటేశ్వర్లు, అనీస్, మహేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడుదాం

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మానాయక్, శ్రీరాంనాయక్

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాంనాయక్

మిర్యాలగూడ, నవంబర్ 7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఐక్యంగా పోరాడాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మానాయక్, శ్రీరాంనాయక్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అమరవీరుల భవనంలో జరిగిన సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గిరిజనులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు గిరిజనశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బానోతు నాగేశ్వర్‌రావు, కార్యదర్శిగా లావుడియా ఎర్రనాయక్, గౌరవాధ్యక్షుడిగా సపావత్ పాపానాయక్, ఉపాధ్యక్షులుగా రవినాయక్, ధీరావత్ శ్రీనునాయక్, రమావత్ హనుమంతునాయక్‌ను ఎన్నుకున్నారు. ఎర్రానాయక్, నాగేశ్వర్‌రావునాయక్, రవినాయక్, భూక్యాపాండునాయక్, బాలూనాయక్ పాల్గొన్నారు.

ప్రజలపై ధరల భారం మోపుతున్న ప్రధాని మోదీ

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, నవంబర్ 7: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలపై ధరల భారాలు మోపుతూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన పట్టణ మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలోని ప్రజా సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ.. మత రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు అవుతున్నా హామీలు అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, బావండ్ల పాండు, అరుణ, రవి నాయక్, మంగారెడ్డి, అయూబ్ పాల్గొన్నారు.

నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

● ట్రాన్స్‌కో సీఈ బాలస్వామి

సమావేశంలో మాట్లాడుతున్న సీఈ బాలస్వామి

నల్లగొండ రూరల్, నవంబర్ 7: విద్యుత్ వినియోగదారులకు న్యాయమైన నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి ఆదేశించారు. గురువారం డీఈ కార్యాలయంలోని విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధి పొందని వారిని గుర్తించి ఎంపీడీఓ కార్యాలయంలో మరోసారి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్సీ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మిర్యాలగూడ, నవంబర్ 7: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన గోవర్దన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట తిరుమలగిరి వజ్రం, రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, తిరుమలగిరి అశోక్, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

మున్సిపల్ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ

చండూరు, నవంబర్ 7: ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన చండూరు మున్సిపల్ కార్మికుడు బొమ్మకంటి భిక్షమయ్య కుటుంబాన్ని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళావెంకన్న పరామర్శించారు. అనంతరం కార్మికుడి కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు. భిక్షమయ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట కౌన్సిలర్ మంచుకొండ కీర్తీ సంజయ్, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి బొడ్డు సతీశ్‌గౌడ్, సంగెపు సురేశ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో రన్నరప్‌గా నల్లగొండ

బహుమతి అందుకుంటున్న నల్లగొండ హాకీ జట్టు

నల్లగొండ రూరల్, నవంబర్ 7: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాకీ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్‌లో ఆదిలాబాద్ జట్టు 2–1 గోల్స్ తేడాతో విజయం సాధించగా నల్లగొండ రెండో స్థానంలో నిలిచింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన క్రీడాకారులు విగ్నేశ్, మహ్మద్ మాజ్, వినయ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. రన్నరప్‌గా నిలిచిన జిల్లా జట్టును, కోచ్ మేనేజర్లు ఎండీ యావర్, ఇమామ్ కరీంను స్కూల్ గేమ్స్ సెక్రటరీ దగ్గుపాటి విమల అభినందించారు.

Union Bank of India యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మహబూబ్‌నగర్ రీజియన్

బంగారు ఆభరణముల వేలము ప్రకటన

ఈ క్రింద చూపబడిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శాఖలోని ఖాతాదారులు, తమ బంగారు వస్తువుల హామీపై వ్యవసాయేతర అవసరాలకై పొందిన అప్పులు తిరిగి చెల్లించమని అనేక డిమాండ్ నోటీసులు ఇచ్చినను అప్పులు తిరిగి చెల్లించని కారణముగా బ్యాంక్ నిబంధనల ప్రకారం తేది : 22-11-2024 సాయంత్రం 04.00 గంలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈ క్రింది శాఖలో బహిరంగ వేలము వేయబడును.

ఈ క్రింద సూచించిన వివరములు తేది: 07-11-2024 నాటి వరకు అందుబాటులో ఉన్నవి. తేది: 08-11-2024 తరువాత చోటుచేసుకొనే మార్పులను వేలము రోజు పరిగణనలోకి తీసుకోబడదు.

బంగారు ఆభరణముల వేలం వేయు వివరములు

క్ర.సం.	రుణగ్రస్తుని పేరు	ఖాతా నం.	మొత్తం బరువు (గ్రా.లలో)
	చందూర్ బ్రాంచ్, నల్గొండ జిల్లా		
1	ముంజంపల్లి సాయికిరణ్	247316540007478	11.00
	రాజవరం బ్రాంచ్, నల్గొండ జిల్లా		
2	సొడబోయిన మల్లయ్య	201616540000750	18.00

షరతులు : 1) ఖాతాదారులలో ఎవరైనా బ్యాంకు వారి నోటీసులు ఏ కారణము చేతనైనా అందని యెడల నోటీసు తిరిగి వచ్చిన యెడల వారికి కూడా ఈ ప్రకటనపూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. 2) ఖాతాదారులు ఎవరైనా మరణించియుండిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. 3) తాకట్టుదారులు ఇదే చివరి నోటీసుగా భావించి, బకాయి చెల్లించగలరు. తదుపరి ఆక్షేపణలు అంగీకరించబడవు. 4) వేలమందు పాల్గొనదలచినవారు PAN కాపీతో EMD క్రింద రూ.10,000/- తేది: 22-11-2024 ఉ॥ 10:00 గం.ల నుండి 04:00 గం॥ లోపు పైన తెల్పిన శాఖలో చెల్లించి వేలంలో పాల్గొనగలరు. 5) హెచ్చు పాటదారులు మొత్తం పాట సొమ్మును అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 6) ఎటువంటి కారణము లేకుండా వేలం రద్దుగాని, వాయిదా వేయుటకు బ్యాంకు శాఖ వారికి అధికారము కలదు. 7) వివరాలకు శాఖాధిపతిని బ్యాంకు పనివేళలలో సంప్రదించండి.

తేది : 08-11-2024 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆదర్శ రైతుల మండల కార్యవర్గం ఎన్నిక

కట్టంగూర్, నవంబర్ 7 : ఆదర్శ రైతుల మండల కార్యవర్గాన్ని గురువారం కట్టంగూర్‌లో డివిజన్ అధ్యక్షుడు దొంతూరి శంకరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండమల్ల అంతయ్య, ఉపాధ్యక్షుడిగా కుంభం విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెద్ది వెంకన్న, కార్యదర్శిగా యర్కల సైదులు, కోశాధికారిగా బెజవాడ రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఊట్కూరి యాదయ్య, భీమనబోయిన రాంబాబు, మాద సైదులు, నర్సింహ, బండారి యాదయ్య, పొన్న అంజయ్య, సలహాదారుడిగా రేకల భిక్షం ఎన్నికయ్యారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సీపీఎం

పెద్దవూర, నవంబర్ 7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రజలపై ధరల భారాన్ని మోపుతుందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు చినపాక లక్ష్మీనారాయణ, దుబ్బ రామచంద్రయ్య, దోరేపల్లి మల్లయ్య, బషీర్, తరి రామకృష్ణ, కొండలు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

కొండమల్లేపల్లి, నవంబర్ 7 : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్ ఉపయోగ పడుతుందని ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ నాయక్, సైదానాయక్ పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు గండిపెట్టిన కేంద్రప్రభుత్వం : టీఆర్‌జీఎస్

హాలియా, నవంబర్ 7 : అగ్రవర్ణ పేదల కోసం ఈడబ్ల్యూఎస్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 10 శాతం రిజర్వేషన్ల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు గండి పడిందని టీఆర్‌జీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొర్ర శంకర్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన హాలియాలో గిరిజన సంఘం ఆవిర్భావ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనాభాలో ఒక్కశాతం ఉన్న అగ్రవర్ణాల కోసం ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం సరికాదన్నారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఆర్‌జీఎస్ నాయకులు నరేశ్‌నాయక్, రవి నాయక్, లాలూనాయక్ పాల్గొన్నారు.

9న తెలంగాణ జనసమితి జిల్లా ప్లీనరీ

మిర్యాలగూడటౌన్, నవంబర్ 7: ఈ నెల 9న నల్లగొండలోని టీఎన్‌జీవో భవన్‌లో జరగబోయే తెలంగాణ జన సమితి జిల్లా ప్లీనరీ, పౌరసమాజంతో మాటా ముచ్చట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్లీనరీ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఉద్యమ కళాకారులు, జర్నలిస్టులు, సకల జనులు ప్లీనరీలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గుండెబోయిన నాగేశ్వర్‌యాదవ్, జిల్లా కార్యదర్శి లావూరి క్రాంతికుమార్, సైదానాయక్, ప్రకాశ్‌నాయుడు, రవీందర్‌నాయక్, హరినాయక్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు హైకోర్టు అనుమతి

దామరచర్ల, నవంబర్ 7: దామరచర్ల మండలం గణేశ్‌పాడు వద్ద ఉన్న పెన్నాసిమెంటు కర్మాగారం రెండోసారి నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దుచేయాలని సామాజిక కార్యకర్త నక్కాశ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. కర్మాగారం 12వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించుకోవాలనీ, ప్రజాభిప్రాయంలో పిటిషనర్ వ్యక్తం చేసిన అభ్యంతరాలను నివృత్తి చేయాలని, అభ్యంతరాలను పూర్తిగా రికార్డు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించాలని స్పష్టం చేసింది. పిటిషనర్ అభ్యంతరాలు చట్టప్రకారం పూర్తిగా పరిష్కారమైన తర్వాతే అనుమతుల వ్యవహారం కొనసాగుతుందనీ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె. శ్రీనివాసరావు తీర్పు చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి : ఎస్ఎఫ్ఐ

చండూరు,నవంబర్ 7 : పేద విద్యార్థుల మధ్యాహ్నం భోజనం బిల్లులు తన ఖాతాలో వేసుకుంటూ విద్యార్థుల కడుపు కొడుతున్న చండూరు జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాఠశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ఇస్తున్న బిల్లులను తన ఖాతాలో వేసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. విద్యార్థుల సంఖ్య, బిల్లులకు మధ్య చాలా వ్యత్యాసం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఈ విషయంపై సమగ్ర విచారణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకారపు నరేశ్, నవదీప్, కిరణ్, మున్న, జోసెఫ్, వంశీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరామర్శ

మాడ్గులపల్లి, నవంబర్ 7: మండలంలోని చిరుమర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మహ్మద్ సలీం తండ్రి జానిమియా అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గ్రామానికి వెళ్లి జానిమియా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తులు

నీలగిరి, నవంబర్07. జిల్లా వైద్యారోగశాఖ పరిధిలోని ఎన్‌హెచ్ఎం ప్రోగ్రామ్‌లో డీపీఓ పోస్టుకు ఈ నెల 12లోగా దరకాస్తు చేసుకోవాలని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు http://nalgonda. telangana. gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిట్యాల, నవంబర్ 7 : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పెద్దకాపర్తి గ్రామశివారులోని 65వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని, పంచాయతీ కార్యదర్శి గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
★I, KONATHAM JAGADEESHWAR REDDY, R/o. House No. 2-1-72, Kasturi Bazar, Saibaba Temple Back Side, Ward-26, Suryapet Village & Mandal & District-508 213, T.S. Changed My Name is "KONATHAM JAGADISHWAR REDDY".
NT-339385

WANTED HELPERS
★హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు ''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం॥లు. No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059